క్లుప్తంగా

నాణ్యమైన విద్యను అందించండి



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

ఉయ్యాలవాడ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంపై దృష్టి సారించాలని ఎంపీడీఓ రఘురాం ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మండలంలోని పుచ్చకాయలపల్లె కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాల, మాయలూరు జిల్లా పరిషత్ పాఠశాలలను ఎంఈఓ వీరప్రతాప్‌రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల బోధన తీరు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. 10వ తరగతి, ఇంటర్‌లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాలలో వసతులు, విద్యార్థుల సంఖ్య, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు.

ఈ గేదెలను తీసుకెళ్లండి



బందెలదొడ్డిలో ఉన్న పాడిగేదెలు

దొర్నిపాడు: తప్పిపోయి చాకరాజువేముల గ్రామ పొలాల్లో తిరుగుతున్న నాలుగు పాడి గేదెలను కావలివాళ్లు బందెలదొడ్లో పెట్టారు. పది రోజులవుతున్నా ఆ గేదెలను తీసుకెళ్లేందుకు ఎవరూ రాలేదు. దీంతో అవి వానకు తడుస్తూ ఇబ్బంది పడుతున్నాయి. వాటి యజమానులు ఎవరైనా ఉంటే తగిన ఆధారాలు చూపించి తీసుకెళ్లాలని చాకరాజువేముల గ్రామ పెద్దలు తెలిపారు. వివరాలకు 8008662065 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

మౌలాలిస్వామికి ప్రత్యేక ఫాతెహాలు



మౌలాలిస్వామి పీరును దర్శించుకుంటున్న భక్తులు

రుద్రవరం: మండల కేంద్రం రుద్రవరంలో వెలసిన మౌలాలి స్వామి పీరుకు ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. మొహరం వేడుకలు ముగిసిన మూడు రోజులకు జియారత్ నిర్వహిస్తారు. ఇందులో భాగంగానే శుక్రవారం పీరుకు ఫాతెహాలు సమర్పించి, భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అయితే, ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో భక్తుల సంఖ్య తగ్గింది.

అంకాలమ్మకు బోనం సమర్పణ



అంకాలమ్మకు బోనం సమర్పించేందుకు వెళ్తున్న ఆలయ అధికారులు, ప్రధానార్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం గ్రామదేవత అంకాలమ్మకు శుక్రవారం మూలా నక్షత్రం సందర్భంగా లోకకల్యాణం కోసం దేవస్థానం తరుపున బోనం సమర్పించారు. ఉదయం ఆలయ మహాద్వారం నుంచి స్వామివారి ప్రధానార్చకుడు హెచ్.వీరయ్యస్వామి, అమ్మవారి ఆల య ప్రధానార్చకులు ఎం.ఉమానాగేశ్వరశాస్త్రి, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి ఎం.హరిదాసు, పలువురు అర్చకస్వాములు, వేదపండితులు సంప్రదాయబద్ధంగా పట్టువస్త్రా లు, పసుపుకుంకుమ, గాజులు, ఫలపుష్పాల తో అంకాలమ్మ ఆలయం వద్దకు చేరుకున్నా రు. ముందుగా లోక్షేమం కోసం సంకల్పం పఠించారు. అనంతరం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి బోనం సమర్పించారు.

భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం సాయంత్రం ఊయల సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల పూజలు జరిపించారు.

రేపు శాకంబరీ ఉత్సవం

మహానంది: ఆషాడమాసం, శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని మహానందిలోని కామేశ్వరిదేవి అమ్మవారికి ఆదివారం శాకంబరీ ఉత్సవం నిర్వహిస్తున్నట్లు వేదపండితుడు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు. ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి నంద్యాలకు చెందిన కూరగాయల వ్యాపారి లక్కనబోయిన ప్రసాద్ కూరగాయలు వితరణ చేయనున్నారని చెప్పారు.

జోరుగా ఇంటర్ అడ్మిషన్లు



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరేందుకు వచ్చిన విద్యార్థులు



విద్యార్థులతో కళకళలాడుతున్న తరగతి గది

- జిల్లాలో 139 జూనియర్ కళాశాలలు
- ఈనెల 31వరకు అడ్మిషన్లకు అవకాశం
- ప్రభుత్వ కాలేజీల్లో ప్రవేశానికి విద్యార్థుల ఆసక్తి

నంద్యాల(న్యూటౌన్): జూనియర్ ఇంటర్‌లో ప్రవేశాలు జోరందుకున్నాయి. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో మొత్తం 139 జూనియర్ కాలేజీలు ఉన్నాయి. వీటిలో గత ఏడాది 13,879 మంది అడ్మిషన్లు పొందగా.. ఈ ఏడాది ఇప్పటి వరకు దాదాపు 13,955 అడ్మిషన్లు పొందినట్లు తెలుస్తోంది. ఈ నెల 31 వరకు అడ్మిషన్లకు అవకాశం ఉండటంతో చాలా మంది దరఖాస్తులు చేసుకుంటున్నారు. అత్యధికులు ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ప్రవేశానికి ఆసక్తి చూపుతున్నారు.

మొదలైన తరగతులు

ఇంటర్ కాలేజీలు ఈ ఏడాది జూన్ ఒకటో తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. నాటి నుంచే సీనియర్ ఇంటర్ విద్యార్థులకు తరగతులు మొదలయ్యాయి. తర్వాత అడ్మిషన్లు పొందిన జూనియర్ ఇంటర్ విద్యార్థులకు తరగతులు ప్రారంభమయ్యాయి. పదోతరగతి పాస్ అయి వివిధ కారణాలతో టీసీలు తీసుకొని విద్యార్థులతో పాటు ఇటీవల వెలువడిన సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఇప్పుడు ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకుంటున్నారు.

ప్రభుత్వ కాలేజీల్లో ప్రవేశానికి ఆసక్తి

వైఎస్ జగన్ పాలనలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు బలోపేతమయ్యాయి. మనబడి నాడు–నేడు కార్యక్రమం కింద సకల సౌకర్యాలతో కాలేజీలను అభివృద్ధి చేశారు. నాణ్యమైన విద్యాబోధన జరుగుతుంది. దీంతో ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు క్రేజ్ పెరిగింది. పలు సర్కారు విద్యా సంస్థలు చదువులో ప్రైవేట్ విద్యాసంస్థలకు పోటీపడుతున్నాయి. జిల్లాలో మొత్తం 57 ప్రభుత్వ కాలేజీలు ఉన్నాయి. ఇందులో ఇప్పటికే సోషల్ వెల్ఫేర్‌కు సంబంధించిన కళాశాలల్లో 480, బీజీ వెల్ఫేర్ జూనియర్ కాలేజీల్లో 1571, ట్రైబల్ జూనియర్ కాలేజీల్లో 350, కేజీబీవీ జూనియర్ కాలేజీల్లో 955, హైస్కూల్ ప్లస్ కళాశాలల్లో 31 అడ్మిషన్లు జరిగాయి.

విద్యార్థులకు 'ప్రైవేటు' గాలం

ఈ ఏడాది పదో తరగతిలో 80.63 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కావటంతో జూనియర్ కాలేజీలకు డిమాండ్ పెరిగింది. జిల్లా నుంచి 23,786 మంది పరీక్షలు రాయగా 20,367 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 10,216 మంది, బాలికలు 10,515 మంది ఉన్నారు. దీంతో ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల వారు విద్యార్థులకు గాలం వేస్తున్నారు. సప్లిమెంటరీ విద్యార్థుల కోసం ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు ఊరూరా తిరిగేస్తున్నాయి. అక్కడి కాలేజీల్లోని అధ్యాపకులకు టార్గెట్లు పెట్టి మరీ అడ్మిషన్ల కోసం వేట సాగిస్తున్నారు.

ప్రవేశాలు పెరుగుతున్నాయి



ఇంటర్మీడియెట్ అడ్మిషన్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. అన్ని యాజమాన్య జూనియర్ కాలేజీల్లో ముఖ్యంగా ప్రభుత్వ కాలేజీల్లో అందుబాటులో ఉన్న సీట్లన్నీ భర్తీ అయ్యేలా ప్రిన్సిపాళ్లు బాధ్యత తీసుకుంటున్నారు. విద్యాబోధన, వసతులు మెరుగుపడటంతో అడ్మిషన్లు కూడా పెరుగుతున్నాయి. –గురువయ్యశెట్టి, ఆర్ఐఓ, నంద్యాల

హింసాత్మక దాడులు సరికాదు



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, మద్దతుదారులపై హింసాత్మక దాడులు జరుగుతున్నాయని, ఇది సరికాదని ముస్లిం ఫెడరేషన్ నాయకులు మహబూబ్‌బాషా, సోహేల్‌రాణా అన్నారు. హింసాత్మక రాజకీయాలకు అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజకుమారికి వారు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలో రషీద్ అనే వైఎస్సార్‌సీపీ కార్యకర్తను తెలుగుదేశం పార్టీకి చెందిన జిలానీ నడిరోడ్డుపై ప్రజలందరూ చూస్తుండగా దారుణంగా నరికి చంపడం దుర్మార్గమన్నారు. గత నెల రోజులుగా రాష్ట్రంలో ఇటువంటి భయానక సంఘటనలు చాలా జరిగాయన్నారు. ప్రధానంగా బలహీన వర్గాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలపై దాడులు, హత్యలు జరగడం దారుణమన్నారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి శాంతిభద్రతలను కాపాడాలని కోరారు.

నందమూరినగర్‌ను పట్టించుకోండి



వర్షపునీటిని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): సమస్యలతో సతమతమవుతున్న నందమూరినగర్‌ను మంత్రి ఫరూక్ పట్టించుకొని అభివృద్ధి చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం నందమూరినగర్‌లో నీరు నిల్వ ఉన్న ప్రాంతాన్ని పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. పట్టణ శివారులోని ఈ కాలనీలో సరైన సౌకర్యాలు లేక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రహదారుల్లో వర్షపునీరు నిల్వ ఉండడంతో నడిచేందుకు ఇబ్బందిగా మారిందన్నారు. పాలకుల స్పందించి ఈ ప్రాంత సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జమాల్‌సా, పక్కీర్, హుసేన్‌బీ, హసీనా, పాహింషా, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రత నియమాలు పాటించండి

నంద్యాల(అర్బన్): వర్షాకాలంలో పారిశ్రామిక, వాణిజ్య, విద్యుత్ వినియోగదారులు విద్యుత్ భద్రతా నియమాలు పాటించాలని పట్టణ విద్యుత్ శాఖ ఏఈ రామయ్య శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా ప్రమాదాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

- ఇంట్లో స్విచ్చు బోర్డులను తగినంత ఎత్తులో అమర్చుకోవాలి. పరికరాలు నాణ్యతతో కూడినవి ఉండాలి
- వర్షం పడుతున్నప్పుడు విద్యుత్ స్తంభాలు, సపోర్ట్ వైర్లను ముట్టుకోరాదు.
- తడి చేతులు, తడికాళ్లతో ఉన్నప్పుడు స్విచ్‌లు వేయరాదు.
- ఏదైనా విద్యుత్ ప్రమాదం జరిగినట్లు గమనిస్తే ఆ వ్యక్తిని గానీ, విద్యుత్ పరికరాన్ని గానీ నేరుగా తాకరాదు.

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్

జూపాడుబంగ్లా: ఉపాధి పనుల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రజలు లిఖితపూర్వకంగా తెలియజేయాలని సోషల్‌ఆడిట్ స్టేట్ టీం లీడర్ లోకేశ్వరరెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని తాటిపాడు, 80బన్నూరు, జూపాడుబంగ్లా గ్రామాల్లో సోషల్‌ఆడిట్ గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా తాటిపాడులో నిర్వహించిన సోషల్ ఆడిట్ గ్రామసభలో ఆడిట్ బృందం సభ్యుల విచారణలో వెల్లడైన విషయాలను గ్రామస్తులకు చదివి వినిపించారు.. కేసీ కాల్వ కట్ట వెంట 400 మొక్కలు నాటగా కేవలం 25 మాత్రమే బతికాయని సుమారు రూ.16 వేల నష్టం వాటిల్లిందన్నారు. మారుతమ్మ అనే మహిళ 6 రోజులు పనికివచ్చినట్లు కనబరచి రూ.1,170 ఆమె బ్యాంకు ఖాతాలో జమచేసినట్లు తెలిపారు.

విస్తారంగా మినుము సాగు

- తక్కువ పెట్టుబడి ..అధిక ఆదాయం
- పంట సాగుపై ఆసక్తి చూపుతున్న రైతులు



గుంప్రమాన్‌దిన్నెలో సాగైన మినుము పంట

శిరివెళ్ల: ఆరుతడి పంటల కింద మినుము సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. స్వల్పకాలంలో లాభసాటి పంట కావడంతో ఈసారి ఎక్కువ మంది మినుము సాగు చేస్తున్నారు. ఇప్పటికే ఖరీఫ్ కింద మండలంలో 740 హెక్టార్లలో మినుము, 235 హెక్టార్లలో మొక్క జొన్న, 5 హెక్టార్లలో పెసర పంటలు సాగు అయ్యాయి. పెసర పంట జీనేపల్లెలో మాత్రమే వేశారు. ఆరుతడి పంటలు మూడు నెలలకే వస్తాయి. ఇప్పుడు మినుము, పెసర పంటలు సాగు చేసే రైతులు మళ్లి అక్టోబర్‌లో జొన్న , ఏదైనా ఇతర పంటలు సాగు చేస్తారు. గుంప్రమాన్‌దిన్నె, జీనేపల్లెలో ఏడాదికి రెండు పంటలు పండిస్తారు.

పెట్టుబడి తక్కువ– ఆదాయం అధికం

వాతావరణం అనుకూలిస్తే రైతులకు అరుతడి పంటలు లాభదాయకం. ఈ పంటలకు పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ. నీరు కూడ తక్కువే. మినుము పంట సాగుకు ఎకరానికి పెట్టుబడి రూ. 15 వేలు. ఎకరానికి దిగుబడి 4 నుంచి 5 క్వింటాలు వస్తుంది. క్వింటం మినుము ధర రూ. 9 వేల చొప్పున లెక్కగట్టినా ఎకరానికి రైతుకు రూ. 36 వేల నుంచి 45 వేల వరకు వస్తుంది. పెట్టుబడి పోను రూ. 20 వేల నుంచి 30 వేల వరకు మిగులుతుంది. దీంతో మండలంలో శిరివెళ్ల, గోవిందపల్లె, యర్రగుంట్ల, జీనేపల్లె, గుంప్రమాన్‌దిన్నె, కోటపాడు తదితర గ్రామాల్లో ఎక్కువగా మినుము పంట సాగువుతుంది.

20 ఎకరాల్లో సాగు చేశా

ఈ ఏడాది నేను 20 ఎకరాల్లో మినుము పంట వేశాను. అనుకూల వాతావరణం ఉంటే పంట బాగా పండి దిగుబడి బాగా వస్తుంది. పోయిన సంవత్సరం ఖర్చులు పోనూ మంచి ఆదాయం వచ్చింది. అందుకే ఈసారి కూడా మినుము పంట వేశాను. ఈ పంట చేతికొచ్చిన తర్వాత రెండో పంటగా జొన్న వేస్తా.

– రామలింగారెడ్డి రైతు గుంప్రమాన్‌దిన్నె

పరిశుభ్రతపై అవగాహన కల్పించండి

ఉయ్యాలవాడ : సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని ఈఓపీఆర్‌డి మహిధర్‌రెడ్డి పంచాయతీ, సచివాలయ ఉద్యోగులకు సూచించారు. శుక్రవారం డ్రైడేలో భాగంగా గోవిందపల్లె, మాయలూరు, అల్లూరు, ఉయ్యాలవాడ, ఇంజేడు, తదితర గ్రామాల్లో మురికి కాలువలను శుభ్రం చేయించి, దోమల నివారణకు వేస్ట్ ఆయిల్ చల్లించారు.

23 నుంచి ఆధార్ క్యాంపులు

నంద్యాల(సిటీ): పట్టణ పరిధిలో ఈనెల 23 నుంచి 27 వ తేదీ వరకు ఆధార్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపులలో అవసరమైన ఆధార్ సేవలు పొందవచ్చునన్నారు.

లీకేజీ గదుల్లో విద్యార్థులను కూర్చోబెట్టొద్దు

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ పాఠశాలల్లో పైకప్పులు పెచ్చులూడిన చోట, లీకేజీ ఉన్న చోట విద్యార్థులను కూర్చోబెట్టొద్దని డీఈఓ సుధాకర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో ఆదేశాలు జారీ చేశారు. చెట్ల కింద, వరండాల్లో కూడా పిల్లలను కూర్చోనివ్వొద్దన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే విద్యార్థులను విద్యుత్ స్తంభాలు, నీటి కుంటలు, చెరువులు, వాగుల వద్దకు వెళ్లకుండా చూడాలన్నారు. పాఠశాల ఆవరణలో గుంతలు ఉంటే వెంటనే మూసి వేయాలన్నారు. ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు.

అలసత్వం వహిస్తే చర్యలు

మహానంది: సచివాలయ సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని బండిఆత్మకూరు ఎంపీడీఓ విజయరావు హెచ్చరించారు. ఏఓ హనీఫ్‌ఖాన్‌తో కలిసి శుక్రవారం ఏ.కోడూరులోని సచివాలయం, బండిఆత్మకూరులోని కస్తూర్బా పాఠశాలలను సందర్శించారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలని సూచించారు.

వీనులవిందుగా హరికథా గానం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై కడప జిల్లా మైదుకూరుకు చెందిన వై.నాగరాజు భాగవతార్ శివపార్వతుల కల్యాణంపై హరికథ గానం చేసి భక్తులను అలరించారు. హార్మోనియం వై.జయకృష్ణ, తబల సహకారాన్ని వై.సుధాకర్ అందించారు.

నేటి నుంచి వసతి గృహాల సందర్శన



మాట్లాడుతున్న ధనుంజయుడు

నంద్యాల(న్యూటౌన్): వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నేటి నుంచి ఈనెల 30వ తేదీ వరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో హాస్టళ్ల సందర్శన కార్యక్రమం చేపడుతున్నట్లు నంద్యాల జిల్లా కార్యదర్శి ధనుంజయుడు పేర్కొన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు, కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలని, అలాగే విద్యార్థులకు నాణ్యమైన ఆహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా డిమాండ్ల పరిష్కారం కోసం వచ్చే నెల 6వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. సమావేశంలోనాయకులు తరుణ్, సిద్దు, వినోద్, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఆర్ఎంకు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): గూడ్స్‌షెడ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఇలాంటి పలు పలు సమస్యలపై వారు రైల్వే డీఆర్ఎం రామకృష్ణకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు.అనంతరం సీఐటీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గౌస్, తోట మద్దులు మాట్లాడుతూ డోన్ నుంచి విజయవాడకు వెళ్లే ప్రధాన రైల్వే రహదారుల్లో నంద్యాల జంక్షన్ చాలా పెద్దదన్నారు. అయితే ఇక్కడ ప్లాట్‌ఫాం లేకపోవడం వల్ల గూడ్స్‌షెడ్ హమాలీ వర్క్స్ కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బరువు మోసే సందర్భంలో కిందపడి గాయాలపాలవుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్లాట్‌ఫాం నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

దోమలతో అప్రమత్తంగా ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు

గోస్పాడు: వర్షాకాలంలో దోమల బెడద ఎక్కువగా ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ నాగఅనసూయ, నంద్యాల మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరెడ్డి సూచించారు. జాతీయ డెంగీ మాసోత్సవాలను పురస్కరించుకుని మండల కేంద్రం గోస్పాడులోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో బాలికలతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమకాటు వల్ల విషజ్వరాలు ప్రబలుతాయన్నారు. ముందు జాగ్రత్తగా ఇళ్ల పరిసరాలు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. గచ్చులు, తొట్లు, డ్రమ్ములు, పూల కుండీలు, కూలర్లు తదితర వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. అతిసారానికి గురికాకుండా తాగునీటిని వేడి చేసి తాగాలన్నారు. అలాగే ఓఆర్ఎస్ ద్రావణం అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల, హాస్టల్‌లో దోమల నియంత్రణ మందును పిచికారీ చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, ఆరోగ్య సిబ్బంది వెంకటరమణ, మహేశ్వరి, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మవార్లకు చీర, సారె సమర్పణ





ప్రత్యేక అలంకారంలో కాళికాంబదేవి , అమ్మవారికి చీర, సారె సమర్పిస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): ఆషాడమాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని జగజ్జనని, శ్రీకాళికాంబ , వాసవీ కన్యకా పరమేశ్వరి,, శ్రీరమాసమేత సత్యనారాయణ స్వామి ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆయా ఆలయాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు చీర, సారె సమర్పించారు. జగజ్జనని ఆలయంలో అమ్మవారి మూల విరాట్‌కు ఉదయాన్నే అర్చకులు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం సామూహిక కుంకుమార్చన, రాహు కాల పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారికి సారె సమర్పించారు. శ్రీ కాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో అమ్మవారికి బల్లాని రమేష్ దంపతులు ఊరేగింపుగా వచ్చి పట్టువస్త్రాలను సమర్పించారు. శ్రీ రమాసమేత సత్యనారాయణ దేవస్థానంలో ఆలయ చైర్మన్ యాడికి శ్రీదేవి ఆధ్వర్యంలో అమ్మవారికి సామూహిక లలితా సహస్రనామార్చన నిర్వహించారు.



పంట పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

ఆళ్లగడ్డలో భారీ వర్షం



క్రిష్ణాపాడులో జలమయమైన రోడ్డు

ఆళ్లగడ్డ/దొర్నిపాడు: నియోజకవర్గ వ్యాప్తంగా గత రెండు రోజుల నుంచి భారీ వర్షం కురుస్తోంది. దీంతో ఎక్కడ చూసినా వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. మరోవైపు ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలకు ఈ వర్షాలు ప్రాణం పోశాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం ఆళ్లగడ్డలో 37.8, చాగలమర్రిలో 26.8, దొర్నిపాడులో 12.8, రుద్రవరంలో 26.0, శిరివెళ్లలో 10.8, ఉయ్యాలవాడలో 25.8 మిల్లీ మీటర్ల వర్షం పాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

అలనాటి ఆటలు





వర్షాకాలం ప్రారంభమైనా చాలా గ్రామాల్లో వ్యవసాయ పనులు మొదలుకాలేదు. మరోవైపు తుపాను ప్రభావంతో వాతావరణం చల్లగా ఉంది. దీంతో ఎక్కడికి బయటకు పోలేని పరిస్థితి. ఇంట్లో పిల్లలతో సరదాగా గడుపుదామంటే వారు సెల్‌ఫోన్లలో బిజీబిజీ. దీంతో పెద్దవారు గుంపుగా బారాకట్ట (గవ్వలాట), పులిగీతం ఆడుతూ అలనాటి ఆటలను గుర్తు చేశారు. ఈ దృశ్యాలు దొర్నిపాడు మండలం క్రిష్ణాపాడు, దొర్నిపాడు గ్రామాల్లో శుక్రవారం కనిపించాయి. –దొర్నిపాడు